క్లుప్తంగా

3న భారీ జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని గుండుబావి ఎదురుగా ఉన్న శ్రీపద్మావతి, వాణి డిగ్రీ కళాశాలల్లో నవంబర్ 3న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చైతన్యకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారు ఈ మేళాకు హాజరు కావచ్చని, 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారని తెలిపారు. ఉద్యోగాలను బట్టి నెలకు వేతనం రూ.12వేల నుంచి రూ.30వేల వరకు ఉంటుందని, జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 8121984014, 9505601887 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అపర్ణాదేవికి పీహెచ్‌డీ


అపర్ణాదేవి

పలమనేరు: గంగవరం మండలం తాళ్లపల్లెకు చెందిన చింతా అపర్ణాదేవికి అర్ని యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రకటించింది. ఈమె కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. 'ఇంపాక్ట్ ఆఫ్ బయో–మాలిక్యులర్ ఈవెంట్స్ అండ్ ఫిజియోలాజికల్ యాస్పెక్ట్ ఇన్ డెవలప్‌మెంట్స్ ఇన్ సన్‌ఫ్లవర్ సీడ్స్' అనే అంశంపై గైడ్ మనోహర్‌లాల్ పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారు. దీనికిగాను ఆమెకు అర్ని వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

2న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ నడింపల్లెలో నవంబర్ 2న గురువారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు వాల్మీకి సంఘ నాయకులు సోమవారం తెలిపారు. తొలుత వాల్మీకి చిత్రపటాన్ని నడింపల్లె, రాగిమాకులపల్లె, గౌదమాకులపల్లె, టీకేపల్లె, లింగమనాయునిపల్లె, సూరకుంట్ల, రాయలపేట, మారప్పల్లె, నడింపల్లె గ్రామాలలో ఊరేగించనున్నట్లు తెలియజేశారు. అనంతరం అన్నదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

'చెకుముకి' పోటీల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

పలమనేరు: చెకుముకి సైన్సు పోటీల పోస్టర్లను సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ పోటీలు నవంబర్ 10 నుంచి పాఠశాల స్థాయి, 30న మండలస్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జేవీవీ నాయకులు యుగంధర్, కుమారస్వామి రెడ్డి పాల్గొన్నారు.

ఈరోజు

'జగనన్న చెబుదాం' వినతులపై సమీక్ష

సోమల: 'జగనన్న చెబుదాం' కార్యక్రమంలో అందిన అర్జీలపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులతో సమీక్షిస్తారని ఎంపీడీఓ నాగరాజ సోమవారం తెలిపారు. ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జేసీ నిర్వహించడం విదితమే. కార్యక్రమంలో అందిన వినతులు, సమస్యలను ఏ మేరకు సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించారో జేసీ సమీక్షిస్తారని, మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకూ పలు శాఖలు చేసిన పనులపై సామాజిక తనిఖీ చేశారని, దీనికి సంబంధించి వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్టు చెప్పారు. మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్, అటవీశాఖ, గృహ నిర్మాణం, పశుసంవర్థక తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

గంగవరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన ఒక కారు, మరొక ద్విచక్ర వాహనాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్ఐ ప్రతాపెడ్డి సోమవారం తెలిపారు. ఆసక్తి గలవారు నిర్ణీత రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

రామకుప్పం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళి సోమవారం తెలిపారు. వివిధ సమస్యలపై చర్చిస్తామన్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పుష్పవిలాపం

- పతనమైన పూల ధరలు
- ధరలు లేక పొలాలలోనే వదిలేస్తున్న రైతులు
- మార్కెట్‌లో కొనేవారు లేక పారబోస్తున్న వైనం
- దీపావళిపైనే ఆశలు


మార్కెట్ బయట పారబోసిన చామంతి పూలు

కుప్పం రూరల్: రాష్ట్రంలో కుప్పం పూలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రెండు దశాబ్దాల క్రితం కుప్పం పూల రైతులు ఓ వెలుగు వెలిగారు. కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలకు పూలు ఎగుమతి చేసేవారు. రవాణా సమస్యలు ఎదురుకావడంతో క్రమంగా తగ్గించుకున్నారు. ప్రస్తుతం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాలకు పెద్ద మొత్తంలో పూల ఎగుమతి చేస్తున్నారు. అయితే ఇప్పుడు ధరలు పతనం కావడంతో కుదేలవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సైతం పూల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఫలితంగా ఆ ప్రాంతాల వ్యాపారుల రాక తగ్గింది. దీనికి తోడు శుభకార్యాలు లేకపోవడంతో కుప్పం మార్కెట్‌లో పూల ధరలు ఒక్కసారిగా గణనీయంగా పడిపోయాయి. దసరా పండుగకు మంచి ధర పలికిన పూలు వారంలోనే ధరలు పతనం కావడంతో పూల మార్కెట్ కళ తప్పింది. ఎంతో కొంతకు అమ్ముకుందామని ఆశతో మార్కెట్‌కు పూలను తీసుకువచ్చినప్పటికీ ధర లేకపోవడంతో మార్కెట్ బయట పారబోసి రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.


పొలాల్లోనే వదిలిపెట్టిన చామంతి పూలు

పెట్టుబడి రాక ఇబ్బందులు

కుప్పం నియోజకవర్గంలో బంతి, చామంతి, రోజా, కనకాంబరం, కాగడాలు, మల్లె, జాజిమల్లె వంటి పూల రకాలు దాదాపు 2 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటిలో బంతి, చామంతి మాత్రమే వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కేవలం శుభకార్యాలు, పండుగలపైనే ఆధారపడి ఈ పూలను సాగు చేస్తారు. దసరా సందర్భంగా చామంతి కిలో రూ.150 నుంచి రూ.200, బంతి రూ.60 నుంచి రూ.80 వరకు ధర పలికాయి. వారం తరువాత ప్రస్తుతం చామంతి రూ.30, బంతి రూ.20 పడిపోయింది. ఒక్కో రోజు పూలు అమ్ముడుపోవడమే కష్టంగా మారింది. దీంతో రైతులు కోత కూలీకూడా గిట్టుబాటు కాక పూలను పొలాల్లోనే వదిలేస్తున్నారు. చామంతి సాగుకు ఎకరాకు రూ.45వేలు, బంతికి రూ.30 వేలు వ్యయం అవుతోంది. పతనమైన ధరలతో పెట్టుబడి రాకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

మార్కెట్‌కు తగ్గిన వ్యాపారులు

రెండు దశాబ్దాల క్రితం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున పూల వ్యాపారులు కుప్పం మార్కెట్‌కు వచ్చేవారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అక్కడ కూడా విస్తారంగా వర్షాలు కురవడంతో పూల సాగు ఎక్కువైంది. దీంతో వ్యాపారులు ఆయా ప్రాంతాలకే పరిమితమయ్యారు. క్రమంగా కుప్పానికి వారి రాక తగ్గింది. పండుగలు, పెళ్లిళ్ల సమయాల్లో మాత్రం ఇక్కడి మార్కెట్‌కు వస్తున్నారు. అప్పుడు ధరలు నాలుగు రెట్లు పెరిగి రైతులు ఆదాయం కళ్లజూస్తుండగా, మిగిలిన సందర్భాల్లో ఆదాయానికి గండి పడుతోంది.

దసరా సందర్భంగా గత వారం పూల ధరలు కిలో (రూపాయల్లో)		సోమవారం కుప్పం మార్కెట్‌లో ధరలు
చామంతి	: రూ. 150 నుంచి రూ.200	రూ. 30
రోజా	: రూ. 200 నుంచి రూ.300	రూ. 80
బంతి	: రూ.60 నుంచి రూ.80	రూ. 20
కనకాంబరం	: రూ.1500 నుంచి రూ.2000	రూ. 400
కాగడాలు	: రూ.500	రూ. 70
మల్లెపూలు	: రూ. 800	రూ. 300
జాజిమల్లె	: రూ.600	రూ. 180


సోమవారం జనం లేక బోసిపోయిన కుప్పం పూల మార్కెట్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


పుంగనూరులో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

పుంగనూరు: వివిధ రకాల బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉపయోగపడుతోందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి కలసి పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, ముగ్గురికి రూ.1.36 లక్షలు చెక్కులు పంపిణీ చేశామన్నారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి బాధితులకు సీఎం సహాయనిధి మంజూరు చేయించారని తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమణ, ప్రభాకర్ నాయక్, గురివిరెడ్డి, రామమోహన్‌రెడ్డి, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

మండలంలోని ముడిబాపనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. మందులు పంపిణీ, రోగులకు చేస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు.

పౌరహక్కులపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్ఐ మారుతి

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లె ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ మారుతి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఎంపీపీ ఎల్లప్ప మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించేలా హక్కులను కల్పించిందని, వీటికి ఎవరూ భంగం కల్పించరాదన్నారు. గ్రామంలో దారి సమస్యను పరిష్కరించాలని, శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలని, భూమిలేని నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వో జ్యోతి, సర్వేయర్ మధు, అంబేడ్కర్ దళిత సంఘం నాయకుడు సీతాపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా సొమ్ము..


బీమా నగదును అందజేస్తున్న వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, సర్పంచ్ సురేంద్ర రెడ్డి

సోమల: మరణించిన వలంటీర్ కుటుంబానికి సోమవారం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలను వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, సర్పంచ్ సురేంద్ర రెడ్డి అందజేశారు. మండలంలోని తమ్మినాయనిపల్లె పంచాయతీకి చెందిన వలంటీర్ ఆదివారం స్విమ్స్‌లో మరణించడం విదితమే. ఈ నేపథ్యంలో బీమా సొమ్మును మృతుని భార్యకు అందజేశారు. వలంటీర్ మృతికి జెడ్పీటీసీ అమాస కుసుమ, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ–1 ప్రభాకర, ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణ, సింగిల్ విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు సంతాపం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, వీఆర్వో జీవనజ్యోతి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం తహసీల్దార్ సీతారామన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు సమస్యలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ నారాయణ, మున్సిపల్ డీఈఈ మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకర్ నాయక్, రమణ, సభ్యులు రాజు, శ్రీనివాసులు, శంకరప్ప, అశోక్, చిన్నప్ప పాల్గొన్నారు.

రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలు..


యంత్రాలను అందజేస్తున్న భాస్కర్

సోమల: మండల పరిషత్ కార్యాలయం సమీపంలో సోమవారం రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలను వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి శీలం భాస్కర్ పంపిణీ చేశారు. వాటర్ షెడ్ పథకం కింద సోమలలో 4, ఇరికిపెంట పంచాయతీలో 10 యంత్రాలను పంపిణీ చేసినట్లు వాటర్‌షెడ్ పీఓ శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ వైస్ చైర్మన్ పీఎల్ఆర్ రాజారెడ్డి, సోమల మాజీ సర్పంచ్ శ్రీరాములు, మల్లికార్జునరెడ్డి, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

లడ్డూ పోటు, పడితరం స్టోర్ నిర్మాణ పనుల పరిశీలన


లడ్డూపోటు భవనాన్ని పరిశీలిస్తున్న ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి సంబంధించి నూతన లడ్డూ పోటు, పడితరం స్టోర్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఓ వెంకటేశు ఆదేశించారు. ఆయన సోమవారం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

3న రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే


రాష్ట్ర విద్యా సాఫల్య సర్వేపై ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

పలమనేరు: దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల బడుల్లోని విద్యావ్యవస్థ స్వరూపాన్ని, అభ్యసనా ఫలితాలను అంచనా వేసేందుకు దేశవ్యాప్తంగా నవంబరు 3న నిర్వహించే స్టేట్ ఎచీవ్‌మెంట్ సర్వేను పలమనేరు మండలంలో పటిష్టంగా నిర్వహించాలని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ఆదేశించారు. దీనికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ల ద్వారా పరీక్ష ఉంటుందన్నారు. దీనికి ప్రశ్నపత్రాన్ని ఎస్‌సీఈఆర్టీ రూపొందిస్తుందన్నారు. ఇప్పటికే బడుల్లో మాదిరి ప్రశ్నపత్రాలతో విద్యార్థులకు మోడల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పరీక్షలకు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి


బంగాళదుంప పంటలో తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారిణి లక్ష్మీ ప్రసన్న

బైరెడ్డిపల్లె: బంగాళదుంప పంటలో తెగుళ్ల నివారణకు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారిణి లక్ష్మీ ప్రసన్న అన్నారు. మండలంలోని పాతురునత్తంలో సోమవారం బంగాళ దుంప పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బంగాళదుంప పంటలో ఆకుముడత తెగులును గుర్తించాలన్నారు. తెగులు ఆశించినప్పుడు మొక్కలపై పసుపురంగు తరువాత గోధుమ రంగు మచ్చలు ఏర్పడి క్రమేణా మొక్కలు ఎండిపోతాయన్నారు. దీనివల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ లీటరుకు 3 గ్రాములు, మెటలాక్సీల్ లీటరుకు 2 గ్రాములు మందును కలిపి 8 రోజులకోసారి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గడప గడపలో ఆత్మీయత


ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఇంటింటికీ వెళ్లి మాట్లాడిన ఎమ్మెల్యే
- అక్కడికక్కడే సమస్యల పరిష్కారం


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వి.కోట: ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతో పాలకునిగా కాకుండా సేవకునిగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం జవునపల్లె పంచాయతీ గ్రామ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. నక్కనపల్లె, దొమ్మిరిమిట్ట, చెరువుముందరపల్లె, చింతలగుంట, ఎగువపల్లె, మావత్తూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు గత నాలుగున్నరేళ్ల కాలంలో పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. తన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన చిన్నపాటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ఇప్పటికే చాలా వరకు సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో ఏ ఎమ్మెల్యేలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజాసేవకే అంకితమైనట్లు చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇప్పటికే పారిశుధ్య పనులు, తాగునీటి సమస్యలు తీర్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, జిల్లా సాంఘిక సంక్షేమ సలహాదారు అమరనాథ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీరాములరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ గౌస్, ఎంపీటీసీ శివరంజని, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, సర్పంచ్ భారతమ్మ, మండల సచివాలయ కన్వీనర్ కిషోర్, తహసీల్దార్ చిట్టిబాబు, పంచాయతీ కన్వీనర్ సురేష్, మురళి, సర్పంచులు శ్రీనివాసులు, సుభాష్, నాయకులు ఆంజనేయులు, గిరిధర్, సురేష్,సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


మల్లప్పకొండపై నిర్వహిస్తున్న గిరిజా కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం

గుడుపల్లె: మల్లప్పకొండపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గిరిజా కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కుంభాభిషేకం అనంతరం 48 రోజులు అఖండ జ్యోతులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కలశ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, స్వామి వారికి రుద్రాభిషేకం, హోమాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్త జన సందడి నడుమ వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రారంభమైన జగనన్న పాలవెల్లువ గ్రామ సభలు


జగనన్న పాల వెల్లువ సభలో మహిళా పాడి రైతులు, గ్రామస్తులు

గంగవరం: మండలంలో జగనన్న పాలవెల్లువ గ్రామ సభలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవంబర్ నెల 6వ తేదీ వరకూ అన్ని సచివాలయ గ్రామాల్లో ఈ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం గంగవరం, కూర్నిపల్లె, రామాపురం, చీళ్లవారిపల్లెలో మెంటర్లు, సహాయక మెంటర్లు, రూట్ అధికారుల ఆధ్వర్యంలో మహిళా పాడి రైతులకు సమావేశాలు నిర్వహించారు. అమూల్ డెయిరీకి పాలు పోస్తే లీటరు పాలకు రూ. 4 నుంచి రూ.5 వరకూ అదనంగా పొందవచ్చన్నారు. అంతేకాకుండా పాడి రైతులు బ్యాంకు రుణాలు పొందవచ్చని, వారికి పశుదాణా సైతం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అలాగే పది పొసైన మహిళకు (ఏఎంసీయూ) పాల యూనిట్‌కి సెక్రటరీ, అసిస్టెంట్ సెక్రటరీగా ఎన్నుకుంటారన్నారు. అలా ఎన్నుకున్న మహిళలు తమ గ్రామాల్లో అమూల్ డెయిరీకి పాల ఉత్పత్తి పెంచడంపై శ్రద్ధ చూపాలన్నారు. దీనిని మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 11మంది మహిళా సభ్యులతో డెయిరీ సహకార సంఘాలు ఏర్పాటు చేయడంపై చర్చించారు.

కొత్త ఓటర్లను నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో అర్హత ఉన్న ఓటర్లను గుర్తించి వెంటనే నమోదు చేయాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల నమోదు, పరిశీలనపై ఆయన సమీక్షించారు. దొంగ ఓటర్లు, మృతుల పేర్లు, , డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగించాన్నారు. అలాగే మండలంలో అభివృద్ధి పనులపై కూడా ఆయన సమీక్షించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, ముర్వత్ బాషా, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాదమునిరెడ్డి, పోకల చంద్ర, నాగరాజ ప్రసాద్, షకూర్, ప్రభాకర, మధు, దామోదర్, ప్రతాప్‌రెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ఓటర్ల నమోదు, మార్పులు–చేర్పులపై వైఎస్సార్ సీపీ నాయకులు దృష్టి సారించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్లలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ పార్టీ అఖండ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ఎక్కడైనా దొంగ ఓట్లు ఉన్నపక్షంలో వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, పార్టీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, సురేంద్రనాయుడు, కరీముల్లా, సూర్య నారాయణరెడ్డి, యుగంధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, ఇర్షాద్, సర్పంచులు నాగిరెడ్డి, అన్సర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 16, 17 తేదీల్లో స్టాంపుల ప్రదర్శన


పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో నవంబర్ 16, 17న చిత్తూరులోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి స్టాంపుల సేకరణ, ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తపాలా డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రదర్శన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆ రోజు పలు రకాల స్టాంపుల ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, స్టాంపుల డిజైన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తపాల శాఖ అధికారులు గణపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.